క్లుప్తంగా

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం

డాక్టర్ రతన్‌లాల్

దౌల్తాబాద్: ఈ నెల 18వ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ విజయవంతం చేయాలని వైద్యాధికారి రతన్‌లాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కంటివెలుగుపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

కుల్కచర్ల: బడీడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని సీఆర్పీ గాంగ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో బడి మానేసిన పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విద్యార్థి జి.నరేశ్ 9వ తరగతి వరకు చదివి ఆపేశాడు. శుక్రవారం నిర్వహించిన సర్వేలో ఆ విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్‌గౌడ్

కుల్కచర్ల: పార్టీ కార్యకర్తలకు ఎల్లవేలలా అండగా ఉంటామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్‌గౌడ్ అన్నారు. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు అగ్రహారం సత్తయ్య ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నేతలు శుక్రవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, రాజశేఖర్, రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ కొనుగోలుకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మనోహర్

కుల్కచర్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మైక్ సెట్ ఏర్పాటు చేసేందుకు చేవెళ్లకు చెందిన మనోహర్ అనే వ్యక్తి రూ.45వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు మనోహర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున సేవా సమితి అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్రలో విద్యార్థులు

బొంరాస్‌పేట: విద్యార్థులకు చదువుతోపాటు విహారయాత్రలతో విజ్ఞానం పెరుగుతుందని ఉపాధ్యాయులు చెప్పారు. దుద్యాల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు కర్ణాటక రాష్ట్రానికి విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. శుక్రవారం హంపిలోని విరూపాక్షి ఆలయం, గర్భగుడి, విజయనగరం, ఏకశిలా రథం తదితర ప్రాంతాలను సందర్శించారు.

ఆర్థికసాయం అందజేత

దోమ: మండల కేంద్రానికి చెందిన మున్నూరు వెంకట్రాములు గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి సహకార సంఘం ఆధ్వర్యంలో కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు ఆంజనేయులు, నారాయణ, బిచ్చయ్య, సురేశ్‌గౌడ్, బోజిరెడ్డి, వెంకటయ్య, బాలకృష్ణయ్య యాదవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వికారాబాద్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం షీటీం, భరోసా సెంటర్‌ల పోస్టర్ విడుదల చేశారు. వీటితో పాటు ఏఆర్ సిబ్బందికి పీటీ డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఏఎస్పీ ఎంఎ.రషీద్, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ

డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి

గృహ అవసరాలకు ఉపయోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. వివిధ పద్ధతుల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సబ్సిడీ గ్యాస్‌కు, కమర్షియల్ గ్యాస్‌కు ధరలో భారీ వ్యత్యాసం ఉండడంతో వంటగ్యాస్‌ను వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగం
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: వంటగ్యాస్ సిలిండర్ల అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కేవలం గృహ అవసరాలకు ఉపయోగించే వంటగ్యాస్ (డొమెస్టిక్ సిలిండర్లు) అక్రమంగా వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ కొట్లల్లో వీటిని ఎక్కువగా వాడుతున్నారు. ఈ అక్రమ దందాపై అధికారుల నిఘా కరువవ్వడంతో అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు.

రాయితీ పక్కదారి ..

రాయితీపై ప్రజలకు ఇచ్చే వంటగ్యాస్‌ను వ్యాపారులు వారి అవసరాలకు విచ్చలవిడిగా వాడుకుంటున్నారు. వంటగ్యాస్‌ను తక్కువగా వాడేవారి వద్ద ఒక్కో సిలిండర్‌కు ఎంతో కొంత చెల్లించి



ఓ హోటల్‌లో వాడుతున్న డొమెస్టిక్ సిలిండర్

కొనుగోలు చేస్తున్నారు. హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, నడిపే వ్యాపారులు తెలిసిన వారి రాయితీ సిలిండర్లు (డబుల్ సిలిండర్లు) తీసుకుని వాటిని వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు.

రోజుకు నాలుగు బుకింగ్స్ మాత్రమే

మండల పరిధిలోని ఒక్క భారత్‌గ్యాస్ ఏజెన్సీ కింద నవాబుపేట, మోమిన్‌పేట మండలాలకు కలిపి 10,780 వంటగ్యాస్ కనెక్షన్లు ఉండగా, 40 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. కానీ కమర్షియల్ సిలిండర్లు కేవలం రోజుకు 4 నుంచి 5 మాత్రమే బుక్ చేసుకుంటున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు వెల్లడించారు. కమర్షియల్ సిలిండర్లు కొగుగోలు, బుక్ చేసుకోవడం లేదని ఏజెన్సీ వారు తెలిపారు.

దృష్టి సారించని అధికారులు

రీఫిల్లింగ్ వ్యవహారం మొదలుకుని హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, వ్యాపార అవసరాలకు వంటగ్యాస్ సిలిండర్లు వాడుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలో ఎక్కడా తనిఖీలు చేసినా దాఖలాలేవు. వ్యాపార సంస్థలు కేవలం కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వాడేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, టీ కొట్లల్లో కేవలం కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాలి. వంటగ్యాస్ సిలిండర్లను వాడితే చర్యలు తప్పవు. త్వరలోనే తనఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

బీఆర్‌ఎస్‌ది అవినీతి పాలన

నియోజకవర్గ ప్రభారి నర్సింహారెడ్డి



కుల్కచర్ల: సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కుల్కచర్ల: బీజేపీ అభ్యున్నతికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నియోజకవర్గ ప్రభారి పోరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బూత్ స్థాయి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు చేస్తూ అవినీతిపాలన అందిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ విధానాన్ని, మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీను, నాయకులు ఆంజనేయులు, చంద్రలింగం, పండరయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్



మాసయ్యను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్ అన్నారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మొగిలిగిద్ద మాసయ్య అనారోగ్య సమస్యలతో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం అశోక్‌కుమార్ ఆయన్ను పరామర్శించారు. ఆయన వెంట వెంకటయ్య, రాము, సలీం తదితరులు ఉన్నారు.

రుక్మాపూర్ పాఠశాలలో మాక్‌పోలింగ్

పెద్దేముల్: మండల పరిధిలోని రుక్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా నిర్వహించిన మాక్‌పోలింగ్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. 1నుంచి 7వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 89మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు ఎలా నిర్వహిస్తారనే అంశంపై 6వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పుష్పలత, వసంత, రమేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు క్యూలో వేచిఉన్న విద్యార్థులు

న్యాయం చేసే వరకు పోరాడుతాం

జీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



తాండూరు టౌన్: పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు న్యాయం చేసే వరకు పోరాడుతామని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన పోలీసు సెలక్షన్స్ పరీక్షలో కోర్టు తీర్పు ప్రకారం ఏడు మార్కులను కలపాలన్నారు. అయితే పోలీసు రిక్రూట్‌మెంట్ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పక్కన పెట్టడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈవెంట్స్‌ను పాత పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పీఆర్టీయూ టీఎస్ నూతన కమిటీ



పీఆర్టీయూ టీఎస్ దుద్యాల మండల నూతన కార్యవర్గం

బొంరాస్‌పేట: పీఆర్టీయూ టీఎస్ దుద్యాల మండల కమిటీని శుక్రవారం నూతనంగా నియమించారు. ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఎం.జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ మీరజ్, గౌరవ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎంఈఓ కె.రాంరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ వీరేందర్‌జీ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చౌదర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రం ఎదుట పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ వీరేందర్ జీ, రాధాకృష్ణ, చౌదర్‌పల్లి హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీ విజేతలకు బహుమతులు



సర్టిఫికెట్లతో కరాటే పోటీ విజేతలు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40మంది విద్యార్థులు గెలుపొందారు. మాస్టర్ జపాన్ చోటో ఖాన్ కరాటే – డూ అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడారు. కరాటే నేర్చుకుంటే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అమరావతి, కరాటే మాస్టర్ రాము, చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ ఖాజాపాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను పేదలకు అందజేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. కానీ వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు రూ. 26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయిబాబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనునాయక్, నాయకులు ఈశ్వర్‌నాయక్, జయమ్మ, ఊర్మిళ, రత్నమ్మ, సంగీత, సబేరా, తులసీ, శారద, జయప్రద పాల్గొన్నారు.

నేడు బీజేపీ బూత్ కమిటీ సమావేశం

తాండూరు రూరల్: బీజేపీ బూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని తులసి గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి మండల పరిధిలోని గ్రామాల్లో బూత్‌స్థాయి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

9న మండల సర్వసభ్య సమావేశం

బంట్వారం: ఈ నెల 9న ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని బంట్వారం ఎంపీపీ ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

చెక్కుల పంపిణీ వాయిదా

బషీరాబాద్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి షెడ్యూల్ మారడంతో శనివారం బషీరాబాద్‌లో నిర్వహించనున్న చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తహసీల్దార్ వెంకటస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు త్వరలోనే రీషెడ్యూల్ తేదీ చెబుతామన్నారు.

పరామర్శ

యాలాల: మండల పరిధిలోని బషీర్‌మియా తండాకు చెందిన పూర్యానాయక్ గత ఆదివారం హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న గోర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్‌రాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గోర్ బంజార తరఫున బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని కలాల్‌వాడీలో శుక్రవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్‌గౌడ్, రాజు, ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో వైద్య శిబిరం

బంట్వారం: సంగారెడ్డి ఎంఎన్‌ఆర్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈడిగి బాగమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్, క్యాంప్ నిర్వాహకులు వెంకటేశంగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, ఎంఎన్‌ఆర్ ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మీర్జాపూర్‌లో మైసమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సర్పంచ్ వినోద్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, అశోక్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శివమాల ధరించిన భక్తులు



మాల స్వీకరించిన శివస్వాములు

కొడంగల్ రూరల్: మహాశివరాత్రిని సందర్భంగా శివస్వాములు శుక్రవారం నుంచి మండల దీక్షలు స్వీకరిస్తున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని ఆలయంలో అర్చకులు ప్రేమ్‌శంకర్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం 16మంది భక్తులు శివ దీక్ష చేపట్టారు. దీక్షలు స్వీకరించిన వారిలో మల్లేశ్, భీమేశ్, గంగాప్రసాద్, రవి, నందు, బాలు, సంపత్ స్వాములు పాల్గొన్నారు.

11మంది దీక్షాధారణ

ధారూరు: మండల కేంద్రంలో పలువురు శుక్రవారం శివదీక్షలు తీసుకున్నారు. వీరభద్రేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు గణపతికి పూజ నిర్వహించి తరువాత శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం పూజారి చెన్నబసవయ్య స్వామి భక్తులకు హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా 11మంది భక్తులు శివ మాల వేసుకున్నారు.

భవానీ మాతకు ప్రత్యేక పూజలు

బషీరాబాద్: మండల పరిధిలోని దామర్‌చెడ్‌లోని భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వమించారు. అమ్మవారి దర్శనం కోసం నియోజకవర్గంలోని భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడిపి నుంచి హిందూ ధర్మప్రచారకులు లక్ష్మీపతిరాజు స్వామి కాలినడకన దామర్‌చెడ్ వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ పీఠాధిపతి, తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శంకర్ స్వామీజీ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పీఠాధిపతి ప్రవచనాలు చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.



లక్ష్మీపతిరాజును సన్మానిస్తున్న శంకర్‌స్వామిజీ, అయ్యప్ప మాలధారణ స్వాములు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మల్లారెడ్డి

టీయూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లారెడ్డి

పరిగి: ఉపాధ్యాయుల సమస్యలే పరిష్కారమే లక్ష్యమని.. టీయూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో టీయూటీఎఫ్ పాత్ర కీలకమన్నారు. ఉద్యమం సమయంలో సమైఖ్య వాద సంఘం నుంచి విడిపోయి తెలంగాణ సాధనకు ఐక్య ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగస్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై గళం విప్పే సంఘాలు లేకుండా పోయాయన్నారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేయాలంటే టీయూటీఎఫ్‌ను గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు గోపాల్, జాంప్ల, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, బస్వరాజ్ నరేందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, రవికాంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- రోడ్డు ప్రమాద బాధితునికి బీఆర్‌ఎస్ నేత ఆర్థిక సహాయం

చేవెళ్ల: ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల యువ నాయకుడు గుడిపల్లి రవికాంత్‌రెడ్డి సమకూర్చిన రూ. 25వేలను ఎమ్మెల్యే రావులపల్లికి చెందిన బుర్ల సురేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందినట్లు తెలిపారు. వైద్యం కోసం రూ. 10లక్షలు ఖర్చు చేయడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రవికాంత్‌రెడ్డి తనవంతుగా రూ. 25వేలు ఇచ్చినట్లు తెలిపారు. పేదలకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పి.ప్రభాకర్, కావలి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.